# సాక్షి వికారాబాద్

శనివారం : 18 : అక్టోబర్ : 2025






**యాసంగిపై ఆశలు!**

వానాకాలం అతివృష్టితో తీవ్రంగా నష్టపోయిన రైతులు కోటి ఆశలతో యాసంగి సాగుకు సిద్ధమవుతున్నారు. 10లో▸



**సీపీఎస్‌ను రద్దు చేయాలి**

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సీపీఎస్ యూనియన్ రాష్ట్ర నాయకుడు చంద్రకాంత్ ప్రభుత్వాన్ని కోరారు. 10లో▸



**ఆదరణకు నోచుకోని..**

తాండూరు మండలం ఐనెల్లిలోని బాలవికాస వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా మారింది. 11లో▸

## న్యూస్‌రీల్

### కేజీబీవీలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

**అనంతగిరి:** వికారాబాద్‌లోని కేజీబీవీలో అసిస్టెంట్ కుక్– 2, పగలు వాచ్‌మెన్–1 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ బాబు సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాలలోపు వారు అర్హులన్నారు. అర్హత కలిగిన వారు ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5గంటలలోపు కేజీబీవీలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

### స్వీపర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**దుద్యాల్:** మండలంలోని చెట్టుపల్లి తండా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో కాంట్రాక్ట్ పద్ధతిన స్వీపర్ ఉద్యోగాల కోసం దర ఖాస్తు చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి రాధిక తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ..పాఠశాలలో రెండు పోస్టులు ఖాళీగా ఉ న్నట్లు తెలిపారు.7వ తరగతి లేదా ఆపై చదు వుకున్న వారు.. 18 నుంచి 45 ఏళ్ల వయస్సు ఉన్నవారు అర్హులను పేర్కొన్నారు. ఆసక్తి కలిగి న మండలానికి చెందిన మహిళలు ఈ నెల 22వ తేదీ లోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 96668 71181లో సంప్రదించాలన్నారు.

### నేటి బంద్‌ను విజయవంతం చేయాలి

- బీసీ జేఏసీ నాయకులు
- వికారాబాద్ పట్టణంలో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో బీసీ సంఘాల నాయకులు

**అనంతగిరి:** బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా శనివారం చేపట్టనున్న రాష్ట్రవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ యాదగిరి యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం వికారాబాద్‌లో బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ సాగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బంద్‌కు అన్ని వర్గాలు సహకరించాలన్నారు. వర్తక, వాణిజ్య, విద్యా సంస్థలు అందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. రిజర్వేషన్లు సాధించే దాకా ఉద్యమం ఆగదన్నారు. అనంతరం ఆర్టీసీ బస్సులు నడపరాదని డీఎంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బుచ్చిబాబుగౌడ్, బొండాల శ్రీనివాస్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### బీసీ రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

ఎమ్మెల్యే బీఎంఆర్



**తాండూరు:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. నేడు (శనివారం) బీసీ జేఏసీ తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సూచనల మేరకు తాము సంపూర్ణ మద్దతు అందిస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### సీజేఐపై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

**అనంతగిరి:** సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిపై వెంటనే కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాదనలు వింటున్న ప్రధాన న్యాయమూర్తిపై దాడులు చేయడం సరికాదన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం చేపట్టిన తెలంగాణ బంద్‌కు తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, పుష్పరాణి, సునీతరాములు, ఆనందం, రాజు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# నో సేఫ్టీ..!

## రిసార్ట్స్‌లో పర్యాటకులకు రక్షణ కరువు

- అనుమతులు లేకుండానే బోటింగ్
- తరచూ మునిగిపోతున్న పడవలు
- గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- ఇటీవల ఇద్దరి మృత్యువాత
- చోద్యం చూస్తున్న ఆయా శాఖలు



సర్పన్‌పల్లి ప్రాజెక్టులో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బోటింగ్

**వికారాబాద్:** జిల్లాలో అనుమతులు లేని రిసార్ట్స్ విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయి. వీటిలో పర్యాటకుల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కాలం చెల్లిన బోట్లలో పర్యాటకులను ప్రాజెక్టుల్లోకి తీసుకెళ్లి ప్రమాదాల బారిన పడేస్తున్నారు. ఇటీవల బోట్లు తిరగబడి పలువురు మృత్యువాత పడిన విషయం తెలిసిందే.. అయినా అధికారులు నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారు. వికారాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న సర్పన్‌పల్లి ప్రాజెక్టులో ఎలాంటి అనుమతులు లేకుండా ఓ ప్రైవేట్ రిసార్ట్స్ నిర్వాహకులు బోటింగ్ నిర్వహిస్తున్నారు. ఇటీవల బోటు తిరగబడి ఇద్దరు పర్యాటకులు మృతి చెందిన విషయం తెలిసిందే. గతంలో కూడా ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. సంబంధిత శాఖల అధికారులపై తీవ్ర విమర్శలు రావడంతో రిసార్ట్స్‌ను మూసి వేశారు. ఆ వెంటనే రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖలతో విచారణ కమిటీ వేశారు. కమిటీ అక్కడ పర్యటించి నివేదిక కూడా ఇచ్చింది. కానీ అందులోని అంశాలను బయటపెట్టలేదు. అనుమతులు లేకపోవటంతో పాటు రిసార్ట్స్ నిర్వాహకుల తప్పిదం వల్లే పర్యాటకుల ప్రాణాలు గాల్లో కలిసినట్లు విచారణలో తేలినట్లు తెలిసింది. కమిటీ నివేదిక సమర్పించి నెలలు కావస్తున్నా నిర్వాహకులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఓ ఘటన జరిగిన రెండు నెలల తర్వాత ఇద్దరిని రిమాండ్ చేయగా ఆ వెంటనే బెయిల్‌పై విడుదలయ్యారు. ఆ తర్వాత యథేచ్ఛగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. అసైన్డ్ భూమిలో, ప్రాజెక్టు బఫర్ జోన్‌లో, పశువుల తాగు నీటి పానాదిలో నిర్మాణాలు వెలసాయి. అయినా రెవెన్యూ, పోలీసు, నీటిపారుదల, పంచాయతీ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

**వరుస ఘటనలతో బెంబేలు**

రిసార్ట్స్ నిర్వాహకులు సమీప ప్రాజెక్టుల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే బోటింగ్ నిర్వహిస్తున్నారు. కాలం చెల్లిన పడవలు కావడంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. అందులో వెళ్లే పర్యాటకులకు సేఫ్టీ మెజర్ మెంట్స్ ఇవ్వకపోవడంతో ప్రాణాలు కోల్పోతున్నారు. వికారాబా ద్ సమీపంలోని సర్పన్‌పల్లి ప్రాజెక్టులో బోటింగ్ చేస్తూ ప్రమాదవశాత్తు నీటిలో పడిపోవడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మునిగిపోతున్న మరో ఇద్దరిని స్థానికులు కాపాడారు. సర్పన్‌పల్లి ప్రాజెక్టులో ఇది మూడో ప్రమాదం. ఇక్కడి ఓ రిసార్ట్స్‌లో గతంలో అడ్వెంచర్ గేమ్స్ ఆడుతూ బావిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. గతంలో జరిగిన ఘటనకు కారణమైన ఆ రిసార్ట్స్‌లోనే అడ్వెంచర్ గేమ్‌లో భాగంగా కారు నడుపుతూ బోల్తాపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. అయితే రిసార్ట్స్‌ల ఏర్పాటుకు 11 రకాల అనుమతులు అవసరం ఉండగా అందులో ఏ ఒక్కటి కూడా తీసుకోవడం లేదు. కోట్‌పల్లి ప్రాజెక్టు, సర్పన్‌పల్లి ప్రాజెక్టు పరిసరాలు, ఆ ప్రాజెక్టుల బఫర్ జోన్లు పూర్తిగా ఈ కార్యకలాపాల కోసం వినియోగిస్తున్నారు.

### చేయి తడిపితే సక్రమం

జిల్లాలోని కొంత మంది అధికారులు రిసార్ట్స్ నిర్వాహకులకు అండగా నిలుస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మామూళ్లు ఇవ్వకుంటే అక్రమం.. చేయి తడిపితే సక్రమం అనే ధోరణి అవలంబిస్తున్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని అనంతగిరి ఫారెస్టుకు అనుకొని అక్రమంగా ఏర్పాటు చేసిన రిసార్ట్స్ విషయంలో జిల్లా అధికారులు వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. ఎలాంటి అనుమతులు లేవని మూసి వేశారు. నెల తిరక్కుండానే మళ్లీ ఓపెన్ చేశారు. ఏడాది క్రితం కూడా ఇలాగే జరిగింది. కానీ అధికారులు పట్టించుకోలేదు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి అండదండలతో ఈ రిసార్ట్స్ ఏర్పాటు చేయగా ఇప్పుడు కూడా దాని నిర్వహణకు ఓ ప్రజాప్రతినిధి సహకరిస్తున్నాడనే విమర్శలు ఉన్నాయి. ఇందులో బోటింగ్, నైట్ క్యాపింగ్, పలు రకాల అడ్వెంచర్ గేమ్స్, గేమింగ్, హోటల్స్, రాత్రి బస చేసేందుకు గదుల ఏర్పాటు చేశారు. పేకాట, మద్యం సేవించడం వంటివి సాధరమైపోయాయి. ఒక్క రాత్రి బస చేసేందుకు అక్కడ కల్పించే సౌకర్యాలు, అడ్వెంచర్ గేమ్స్‌ను బట్టి ఒక్కో జంటకు రూ.3000 నుంచి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారు.

# రాజీనామా.. ఆమోదం

## పదవి నుంచి తప్పుకొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

- పంతం నెగ్గించుకున్న ఎంపీ కొండా ఎట్టకేలకు ముగిసిన వివాదం
- జిల్లా కన్వీనర్‌గా ప్రహ్లాద్‌రావు
- అధ్యక్షుడి రేసులో పలువురు నేతలు

**వికారాబాద్:** అందరూ ఊహించినట్లే బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఆ వెంటనే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆమోదించడం చకచకా జరిగిపోయింది. దీంతో కొంత కాలంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి.. జిల్లా అధ్యక్షుడి మధ్య ఉన్న వివాదం ముగిసినట్లయ్యింది. గ్రూపు తగాదాలతో విసిగిపోయిన రాజశేఖర్‌రెడ్డి రాజీనామా చేయగా శుక్రవారం ఆమోదించారు. ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరుగుతున్న నేపథ్యంలో కొత్త అధ్యక్షుడి నియామకం తాత్కాలికంగా వాయిదా వేసినట్టు తెలుస్తోంది.గతంలో జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన పార్టీ సీనియర్ నేత కరణం ప్రహ్లాద్‌రావును జిల్లా కన్వీనర్‌గా నియమించారు. కొత్త అధ్యక్షుడు వచ్చే దాకా పార్టీ వ్యవహారాలను ఆయనే చూసుకోనున్నట్లు తెలిసింది.

**ఆరు నెలలకే ఊడిన పదవి**

గతంలో ఎప్పుడూ లేని విధంగా స్థానికేతరుడికి జిల్లా అధ్యక్ష పదవి కట్టబెట్టిన పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆరు నెలలకే రాజీనామా చేయించింది. సిఫారసు చేసిన ఎంపీనే అతన్ని మార్చడంలో ప్రధాన పాత్ర వహించారు. ఇటీవల జరిగిన మీడియా సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తన పదవికి రాజీనామా చేస్తారని పేర్కొనడం గమనార్హం. ఆయన అన్నట్లుగానే రాజీనామా చేశారు. రాజశేఖర్‌రెడ్డి జిల్లా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మధ్య సఖ్యత లేదు. మొదట్లో పార్టీ సీనియర్ నేతలు వర్సెస్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న వ్యవహారం చివరకు కొండా వర్సెస్‌గా మారిపోయింది. జిల్లా కమిటీ ఏర్పాటు సమయంలో రాజశేఖర్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించారని, కొంతమంది సీనియర్ కార్యకర్తలపై దురుసుగా వ్యవహరించారనే విమర్శలు వచ్చాయి.

**రేసులో పలువురు నేతలు..**

జిల్లా అధ్యక్ష పదవిని దక్కించుకునేందుకు పలువురు నేతలు పావులు కదుపుతున్నారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సిఫారసు చేసిన వారికే అధ్యక్ష పదవి దక్కే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన సదానంద్‌రెడ్డి, తాండూరుకు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు రమేశ్, గత అసెంబ్లీ ఎన్నికల్లో పరిగి నుంచి పోటీ చేసిన పరమేశ్వర్‌రెడ్డి పదవి ఆశిస్తున్నట్టు సమాచారం. ఎంపీ అనుచరుడిగా పేరున్న పరమేశ్వర్‌రెడ్డికి పదవి దక్కే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బీసీ సామాజిక వర్గానికి ఆ పదవి ఇవ్వాల్సి వస్తే రమేశ్‌కు ఇచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం.

# బీజేపీది రెండు నాల్కల ధోరణి

- బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ఒత్తిడి పెంచాలి
- సీపీఎం నాయకులు

**తాండూరు టౌన్:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై బీజేపీ రెండు నాల్కల ధోరణి అవలంబిస్తోందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాస్, బుగ్గప్ప ఆరోపించారు. శుక్రవా రం తాండూరులో బీసీ రిజర్వేషన్లపై పలువురు నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీసీ బిల్లును అడ్డుకుంటూ, రాష్ట్రంలో మాత్రం బీసీ బంద్‌కు బీజేపీ మద్దతు పలకడం హాస్యాస్పదమన్నారు. ఈ ద్వంద్వ వైఖరిని ఖండిస్తూ బీసీ జేఏసీ కేంద్రంపై పోరాడితేనే తాము బంద్‌కు సహకరిస్తామన్నారు. లేకుంటే స్వతంత్రంగా నిరశన కార్యక్రమాలు చేపడతామన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించి కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు చంద్రయ్య, మల్కయ్య, కృష్ణ, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీఆర్‌ఆర్

# త్వరలో పరిగికి రైలు కూత

- భూ సేకరణకు సర్వం సిద్ధం
- నిధులు విడుదల చేయనున్న ప్రభుత్వం
- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

**పరిగి:** త్వరలో పరిగికి రైలు కూత వినిపించనున్నట్లు ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో వికారాబాద్ – కృష్ణ రైల్వే లైన్‌కు కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50శాతం నిధులు మంజూరు చేశాయన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో గత ప్రభుత్వం పరిగి, వికారాబాద్ ప్రాంతాలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. జిల్లాకు మంజూరైన అభివృద్ధి పనులను సిద్దిపేటకు మళ్లించారని ఆరోపించారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రైల్వే లైన్‌కు మళ్లీ ప్రాణం పోశారని పేర్కొన్నారు. ఈ నెల 16న జరిగిరి రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వికారాబాద్ కృష్ణ రైల్వే లైన్ భూసేకరణ కోసం రూ.438 కోట్లు కేటాయించాలని నిర్ణయించినట్లు తెలిపారు. త్వరలో పరిగి మీదుగా పనులు ప్రారంభం కానున్నట్లు వివరించారు. అలాగే మన్నెగూడ నుంచి బీజాపూర్ వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి డీపీఆర్ సిద్ధమైందన్నారు. ఈ పనులు పూర్తయితే పరిగి నియోజకవర్గ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉన్న వారు పోటీకి అర్హులని నిర్ణయం తీసుకోవడంతో ప్రజల్లో సంతోషం నింపిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలన్నారు. కాంగ్రెస్ అంటే పేదల ప్రభుత్వమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ఈ నెల 18న నిర్వహించే బీసీ బంద్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని కేంద్రంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, ఏబ్లాక్ అధ్యక్షుడు పార్థసారథి పంతులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, నాయకులు ఆంజనేయులు, సర్వర్, శ్రీనివాస్, జగన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కళాశాలలు తరలించొద్దు

- అప్పాయిపల్లిలోనే భవనాలు నిర్మించాలి
- నిరసన దీక్ష చేపట్టిన గ్రామస్తులు
- మద్దతు తెలిపిన జేఏసీ నాయకులు



మాట్లాడుతున్న కేడీపీ జేఏసీ నాయకులు

**కొడంగల్:** కొడంగల్ మండలానికి మంజూరైన మెడికల్, వెటర్నరీ, యంగ్ ఇంటిగ్రేటెడ్ గురుకులాలను మరో మండాలనికి తరలించాలనే ఆలోచనను విరమించుకోవాలని కొడంగల్ అభివృద్ధి పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ(కేడీపీ జేఏసీ) నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని అప్పాయిపల్లి నుంచి మెడికల్ కళాశాల నిర్మించే స్థలం వరకు గ్రామస్తులు, విద్యార్థులు, వివిధ పార్టీల నాయకులు, విద్యావంతులు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడే నిరసన దీక్ష చేపట్టారు. వీరికి కేడీపీ జేఏసీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొడంగల్ మండలానికి మంజూరైన వాటిని తరలించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఎన్నో ఏళ్లుగా వెనకబడిన ఈ ప్రాంతం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో అభివృద్ధిలో పరుగుతు పెడుతుందని భావించామని కానీ కళాశాలలను ఇతర ప్రాంతాలకు తరలించాలనే ఆలోచన నిరాశకు గురిచేస్తోందన్నారు. అప్పాయిపల్లిలోని 19 సర్వే నంబర్ రైతుల దగ్గర నుంచి మెడికల్, వెటర్నరీ, నర్సింగ్ కళాశాలలు నిర్మిస్తామని భూమిని తీసుకొని పనులు ప్రారంభిచి, వేరే ప్రాంతానికి తరలిస్తామనడం అన్యాయమని అన్నారు. ఇంటిగ్రేటెడ్ గురుకులాలను ముందుగా నిర్ణయించిన ప్రాంతాల్లోనే నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు శ్రీనివాస్, యూ రమేషబాబు, భీమరాజు, గంటి సురేష్, మధుయాదవ్, మాజీ సర్పంచు దత్తుసింగ్, మ్యాతరి సంగప్ప, మల్లప్ప, దొబ్బలి పకిరప్ప, గోకుల్‌సింగ్, గుడిసె వెంకటప్ప, దొడ్ల వెంకటయ్య, అమృతప్ప, శీనునాయక్, రాములుగౌడ్, బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### 20న నృత్య ప్రదర్శన

**తాండూరు టౌన్:** దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని అయోధ్యలో నిర్వహించనున్న ఉత్సవాల్లో తాండూరు జానపద నృత్య కళాకారులు సోమవారం ప్రదర్శన ఇవ్వనున్నారు. డ్యాన్స్ మాస్టర్ రమేశ్ ఆధ్వర్యంలో దీపావళి రోజు తొలిసారిగా బ్రహ్మేంద్ర పోతురాజు వేషధారణలో ప్రదర్శన చేస్తారని తెలిపారు. శివసత్తులుగా శ్రావణి, అనూష, నిఖిత ప్రదర్శన ఇవ్వనున్నారు. జిల్లా నుంచి మొత్తం 15 మంది కళాకారులు వెళ్తుండగా, అందులో నలుగురు తాండూరు కళాకారులే ఉండటం గమనార్హం.

# ఏసీబీకి చిక్కిన ఫారెస్ట్ అధికారులు

## సీతాఫలాల తరలింపు పర్మిట్లకు లంచం డిమాండ్

- పరిగిలోని అటవీ శాఖ కార్యాలయంలో అవినీతి నిరోధఖ శాఖ దాడులు
- ఎఫ్‌ఆర్‌ఓతో పాటు డ్రైవర్ అరెస్ట్
- మరో ఎఫ్‌ఆర్‌ఓను నగరంలో అదుపులోకి..





ఏసీబీకి పట్టుబడిన ఫారెస్ట్ సెక్షన్ అధికారి మొయినుద్దీన్, డ్రైవర్ బాలకృష్ణ

**పరిగి:** సీతాఫలాలు తరలించే వాహనాలకు పర్మిట్లు ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసిన ఇద్దరు అటవీశాఖ అధికారులు ఏసీబీకి చిక్కారు. ఈ ఘటన పరిగిలోని ఫారెస్ట్ ఆఫీస్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పరిగి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని మూడు మండలాల్లో సీతాఫలాల సేకరణ టెండర్‌ను రూ.18 లక్షలకు ఓ కాంట్రాక్టర్ దక్కించుకున్నాడు. అడవి నుంచి సేకరించిన సీతాఫలాలను నగరానికి తరలించేందుకు అవసరమైన వాహనాల పర్మిట్ల కోసం కుల్కచర్ల, కుస్మసముద్రం సెక్షన్ ఆఫీసర్లు మొయినుద్దీన్, సాయికుమార్‌ను సంప్రదించగా, ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. దీంతో చెట్ల నుంచి తెంపిన కాయలు, పండ్లను తరలించే అవకాశం లేక పాడవుతున్నాయి. దీంతో వ్యాపారికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. తన సమస్యను పరిష్కరించమని అధికారులను వేడుకోగా రూ.50 వేలు డిమాండ్ చేశారు. చివరికి రూ.40 వేలకు డీల్ కుదుర్చుకున్న కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శుక్రవారం పరిగి ఆఫీసులో ఉన్న సెక్షన్ ఆఫీసర్ మొయినుద్దీన్ తన డ్రైవర్ ద్వారా డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని ఫారెస్ట్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణకు హాజరైన సాయికుమార్‌ను అక్కడ అదుపులోకి తీసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ వెల్లడించారు.

# మహిళల భద్రతకు ప్రాధాన్యత

- ఎస్పీ నారాయణరెడ్డి



సీఐ సరోజను సన్మానిస్తున్న ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

**అనంతగిరి:** మహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం వికారాబాద్‌లోని ఎస్పీ కార్యాలయం రివ్యూ మీటింగ్ నిర్వహించారు. పీఎస్‌ల వారీగా పెండింగ్ కేసులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించి పూర్తి చేయాలని ఆదేశించారు. కేసుల విషయంలో ఏమైనా సందేహ ఉంటే ఉన్నతాధికారు దృష్టికి తేవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలకు గల కారణాలను తెలుసుకొని వాటి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. తరచూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలన్నారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో ముఖ్యమైందన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఇసుక, గుట్కా, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవాలని ఆదేశించారు. ఇటీవల జరిగిన కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన కొడంగల్ కోర్టు ఏపీపీ అభినయి, వికారాబాద్ కోర్టు ఏపీపీ సమీనాబేగం, మహిళా పీఎస్ సీఐ సరోజ, కొడంగల్, నవాబ్‌పేట ఎస్‌హెచ్‌ఓలు, కోర్టు మానిటరింగ్ అధికారులకు సత్కరించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములు నాయక్, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఆర్డీఓకు ఘన సన్మానం



వాసుచంద్రకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ట్రెసా బృందం

అనంతగిరి: వికారాబాద్ ఆర్డీఓ వాసుచంద్రకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఆయనను తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా బృందం శుక్రవారం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో తహసీల్దార్లు లక్ష్మీనారాయణ, మునీరుద్దీన్, విజయ్‌కుమార్, డీటీలు శ్రీలత, అనిత, శ్రీనివాస్‌గౌడ్, నవీన్, వీరేష్‌బాబు, ఆర్‌ఐలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### రైస్ సరఫరాను వేగవంతం చేయండి



మిల్లు యజమానితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

అనంతగిరి: సీఎంఆర్(కస్టమ్ మిల్డ్ రైస్) డెలివరీని వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధి వేంకటరమణ రైస్ మిల్లును ఆయన తనిఖీ చేశారు. రబీ 202425కు సంబంధించి రైస్ సరఫరాలో అలసత్వం చేయకుండా.. ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లు యజమానికి సూచించారు. ఆయన వెంట పౌరసరఫరాల జిల్లా అధికారి మోహన్ కృష్ణ ఉన్నారు.

### 'మత్తు' దందాను అరికట్టాలి

కొడంగల్ రూరల్: నానాటికీ పెరుగుతున్న మత్తు మందు దందాను అరికట్టేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్(డీసీఏ) శేరిలింగంపల్లి జోన్ అసిస్టెంట్ డైరెక్టర్ కె.అనిల్‌కుమార్, జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఏఎస్.క్రాంతికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజారోగ్యంపై శ్రద్ధ చూపాలని సూచించారు. ఎక్కడైనా మత్తు మందు తయారు చేస్తున్నా, వైద్యుడి చీటి లేకుండా అబార్షన్ కిట్స్, నిద్రమాత్రలు తదితర వాటిని విక్రయిస్తున్నా, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా డీసీఏకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 18005996969కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

### నేరాలను నియంత్రించండి



సీఐతో మాట్లాడుతున్న సీపీ సుధీర్ బాబు

పహాడీషరీఫ్: పెట్రోలింగ్ ముమ్మరం చేసి, నేరాలను నియంత్రించాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు.. ఇన్‌స్పెక్టర్ ఎస్. రాఘవేందర్ రెడ్డికి సూచించారు. శుక్రవారం ఆయన పహాడీషరీఫ్ ఠాణాను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డుల పరిశీలనతో పాటు సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించారు. కేసులు, దర్యాప్తు తదితర అంశాలపై ఆరా తీశారు. న్యాయం కోసం వచ్చే వారికి భరోసా కల్పించాలని చెప్పారు.

### పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తున్న అతిథులు

హయత్‌నగర్: మానవుడు తన అవసరాలకు సహజ వనరులను విధ్వంసం చేస్తున్నాడని, ప్రకృతి సహజత్వాన్ని కాపాడి భావితరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రముఖ పర్యావరణవేత్త పాలడుగు జ్ఞానేశ్వర్ అన్నారు. హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అడవులను కొల్లగొటి, సహజ నీటి వనరులను కలుషితం చేయడంతో మంచినీటిని కొనుక్కునే పరిస్థితి వచ్చిందని అన్నారు. భవిష్యత్తులో గాలిని కూడా కొనాల్సిన దుస్థితి రావచ్చన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి వృక్ష సంబంధమైన వస్తువుల వాడకాన్ని పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, నక్క శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# యాసంగిపై ఆశలు!

రబీలో సాగు విస్తీర్ణం భారీగా పెరగనుంది. గడిచిన కాలంలో కురిసిన భారీ వర్షాలకు చెరువులు, జలాశయాలు నిండుకుండను తలపిస్తుండగా.. భూగర్భ జలాలు పెరిగాయి. పైపైకి ఉబికి వస్తున్నాయి. దీంతో యాసంగి ఈ సారి ఆశాజనకంగా ఉండనుంది.



రబీ సాగుకు సిద్ధమవుతున్న రైతు

**నిండుకుండల్లా జలాశయాలు**

- పెరిగిన భూగర్భ జలాలు
- సాగుకు సన్నద్ధమవుతున్న రైతన్న
- జిల్లాలో 1,56,925 ఎకరాల్లో పంటల అంచనా
- ఉద్యాన పంటలు 7,121 వేలు, వరి 1.01 లక్షల ఎకరాలు

తాండూరు: వానాకాలం(ఖరీఫ్)లో అతివృష్టికి పంటపొలాలు దెబ్బతిన్నాయి. చేతికందొచ్చిన పంట నేలపాలై నష్టాలను మూటగట్టుకున్న రైతన్నలు.. ఆ లోటును ప్రస్తుత యాసంగి(రబీ)లో పూడ్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఆశతో సాగుకు సమాయత్తం అవుతున్నారు. వ్యవసాయ శాఖ ప్రణాళికను మించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**ప్రధాన పంటగా వరి**

రబీ పంటల ప్రణాళికను వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1.56 లక్షల ఎకరాల్లో సాగు అంచనా వేశారు. అయితే అందులో వరి 1.01 లక్షల ఎకరాలు, కూరగాయ పంటలు మరో 7,121 వేల ఎకరాల్లో ఉండనుంది. 70 శాతం ప్రధాన పంటగా వరి సాగు కానుంది. పప్పు, నూనే గింజలు శనగలు 4,216 ఎకరాలు, వేరు శనగ 15,110 ఎకరాలు, మొక్కజొన్న, జొన్న, కుసుమ తదితర పంటలను మిగిలిన ఎకరాల్లో సాగుకు సిద్ధం చేశారు.

**ఉద్యాన పంటలకు ఊతం**

ప్రస్తుత యాసంగిలో 7,121 ఎకరాల్లో కూరగాయలు సాగవనున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఉల్లి, టమాటా, మిరప, బీర, బెండ, క్యాబేజీ తదితర వాటిని పండిస్తున్నారు. ఉద్యాన రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రధానంగా వరి, మొక్కజొన్న, జొన్న, చెరకు, పొద్దుతిరుగుడు, వేరుశనగ పంటలను 1.48 లక్షల ఎకరాలు, కూరగాయలు 7,121 ఎకరాల్లో సాగవనుంది. ఇతర పంటలతో కలిపి మొత్తంగా జిల్లాలో 1,56,925 ఎకరాల్లో యాసంగి సాగుకు ప్రణాళికను సిద్ధం చేశారు.

**పంటల వారీగా రబీ సాగు..**

| పంట | ఎకరాలు |
|---|---|
| వరి | 1,01,397 |
| శనగ | 4,217 |
| వేరుశనగ | 15,110 |
| జొన్న | 12,745 |
| మొక్కజొన్న | 11,271 |
| చెరకు | 700 |
| పొద్దుతిరుగుడు | 2,513 |
| కంది | 1,376 |
| ఇతర పంటలు | 475 |
| కూరగాయ పంటలు | 7,121 |
| మొత్తం | 1,56,925 |

**ప్రాజెక్టుల ద్వారా..**

రబీలో ప్రాజెక్టుల ద్వారా సాగు అధికంగా కానుంది. వర్షాధార పంటలైన జొన్న, కుసుమ మినహా మిగతావి వీటి ద్వారానే పండనున్నాయి. జిల్లాలో ప్రాజెక్టులు, చెరువులు కలిపి 1,100 వరకు ఉన్నాయి. 67,217 బోరు బావులు ఉన్నాయి. వీటి ద్వారా రబీ పంటలకు నీరు అందనుంది. అంతే కాకుండా రబీకి కావాల్సిన ఎరువులు, విత్తనాలను వ్యవసాయ శాఖ రైతులకు అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

**సాగు ఏర్పాట్లు ముమ్మరం**



ఈ సారీ రబీ సాగు పెరగనుంది. జిల్లాలో 1.48 లక్షల ఎకరాల్లో యాసంగి పంటల అంచనా వేశాము. అందుకు రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూస్తున్నాం. మిగతా ఏర్పాట్లను ముమ్మరం చేశాం. నూనే గింజల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

– టి.రాజరత్నం, డీఏఓ, వికారాబాద్

# సీపీఎస్‌ను రద్దు చేయాలి



ఠాగూర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎస్ నాయకులు

అనంతగిరి: ఏ భారం కాని పాత పెన్షన్ విధానాన్ని ప్రభుత్వం పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకుడు చంద్రకాంత్ కోరారు. శుక్రవారం జిల్లా పర్యటనలో ఉన్న ఏఐసీసీ నాయకుడు సూపర్ సింగ్ ఠాగూర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లో సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. దీంతో ఆ ప్రాంతాల ఉద్యోగుల భవితకు భద్రత చేకూరిందని పేర్కొన్నారు. రాజస్థాన్‌లో వెయ్యికి పైగా రిటైర్ అయిన సీపీఎస్ ఉద్యోగులు.. పాత పెన్షన్‌ను తీసుకుంటున్నారన్నారు. తెలంగాణలోనూ అదే విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్, జనరల్ సెక్రటరీ పాషా, రాష్ట్ర సాహిత్య కమిటీ సభ్యుడు మురహరినాథ్, మహబూబ్ నగర్ ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ రెడ్డి, జిల్లా నాయకులు భాస్కర్, వెంకటయ్య పాల్గొన్నారు

# రిజర్వేషన్లు సాధించే వరకు పోరు

పరిగి: రిజర్వేషన్ల సాధనే తమ లక్ష్యమని, అమలు జరిగే వరకు పోరాటం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ నెల 18న బీసీ రిజర్వేషన్ల కోసం బంద్‌ను ప్రకటించామన్నారు. బంద్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు. ఎన్నో సంవత్సరాలుగా బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా, ఉద్యోగాల పరంగా తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెడితే.. కేంద్రం కుట్రపన్ని ఆపిందని ఆరోపించారు. బీసీలపై బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు.



సమావేశంలో బీసీ సంఘాల నాయకులు

### బాలిక ఆత్మహత్య

పరిగి: బాలిక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంసంఘటన మండల పరిధి రూప్‌ఖాన్‌పేట్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకటయ్య, లక్ష్మీల కూతురు గాయత్రి(17) పదో తరగతి ఫేయిల్ అయి, ఇంటి వద్ద ఉంటోంది. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో.. ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు.. పరిగి ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మైనర్ మృతిపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఓ యువకుడి వేధింపులతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొంటున్నారు. ఇదే విషయమై.. ఎస్ఐ మోహన్‌కృష్ణను వివరణ కోరగా.. బాలిక కుటుంబీకుల నుంచి ఫిర్యాదు అందలేదని తెలిపారు. ఫిర్యాదు అనంతరం దర్యాప్తు చేపడతామని చెప్పారు.

### ఆటో ఢీ, ఒకరి మృతి



ఘటనా స్థలంలో శంకర్ మృతదేహం

శంకర్‌పల్లి: ఆటో ఢీ కొన్న ప్రమాదంలో పాద చారి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం మోకిల పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్జాగూడకు చెందిన శంకర్ సింగ్(48) అవివాహితుడు. తల్లిదండ్రులు మరణించడంతో అన్న ఇంట్లోనే ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం సదరు వ్యక్తి.. మిర్జాగూడ గేట్ నుంచి హైదరాబాద్ వైపు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో శంకర్‌పల్లి నుంచి నగరం వైపు వెళ్తున్న ఆటో.. శంకర్‌ను బలంగా ఢీ కొట్టింది. దీంతో ఆయన తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

### ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



సభ్యత్వం అందజేస్తున్న యూనియన్ నాయకులు

మహేశ్వరం: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం టీఎన్జీఓ నిరంతరం పని చేస్తుందని యూనియన్ జిల్లా హడహక్ కమిటీ కన్వీనర్ ముజీబ్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్టీఓ, పంచాయతీరాజ్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి రావాల్సిన అలవెన్సులు, రాయితీలు ప్రతి ఉద్యోగికి అందే విధంగా చూస్తామని చెప్పారు. ఉద్యోగులపై దాడులకు పాల్పడితే సహించేది లేదని, వారికి రక్షణగా ఉంటామన్నారు. కార్యక్రమంలో యూనియన్ సీనియర్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, అశోక్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- అభివృద్ధి పనుల ప్రారంభం

మంచాల: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం మంచాల మండలం ఎల్లమ్మ తండాలో రూ.5 లక్షలతో సీసీరోడ్డు, బోడకొండ గ్రామంలో రూ.5 లక్షలతో సీసీరోడ్డు, మంచాలలో రూ.40 లక్షలతో అండర్ డ్రైనేజీ, ఆరుట్లలో రూ.10 లక్షలతో సీసీరోడ్డు, ఆరుట్లలోని బుగ్గరామ లింగేశ్వర స్వామి ఆలయం వద్ద రూ.కోటి ఐదు లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం, మరో రూ.5 లక్షలతో భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై రైతులకు పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్ వెంకట ప్రసాద్, ఏసీపీ కేపీవీ రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ కంభాలపల్లి గురునాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి, జయమ్మ, మల్లేశ్, పాండు, ఎల్లేష్, ప్రేమాకర్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



రామలింగేశ్వర ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి తదితరులు

# నవజాత శిశు సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- కొడంగల్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజు



శిక్షణ కార్యక్రమానికి హాజరైన స్టాఫ్ నర్సులు

తాండూరు: నవజాత శిశు సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కొడంగల్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజు వైద్య సిబ్బందికి సూచించారు. తాండూరు ఎంసీహెచ్‌లో శుక్రవారం స్టాఫ్ నర్సులు, నర్సింగ్ విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవజాత శిశువులకు ఆరోగ్య సమస్యలు వస్తే ఒత్తిడికి లోనై హైదరాబాద్‌కు రెఫర్ చేయరాదన్నారు. అక్కడే వైద్యం చేయాలని సూచించారు. అత్యవసర సమయాల్లో మెడికల్ కళాశాల నుంచి సలహాలు సూచనలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పెడియాట్రిక్ వైద్యులు డాక్టర్. మూర్తి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాలతి, వైద్యులు శ్రీలత, జైపాల్‌రెడ్డి, స్టాఫ్ నర్సులు అనిత, సౌందర్య, రాణి, ఆసిఫా, నిర్మల సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# అప్రమత్తంగా ఉండాలి

- అగ్నిప్రమాదాలపై అవగాహన అవసరం
- ఫైర్ ఆఫీసర్ సేవ్యనాయక్



అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

దోమ: అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్ సేవ్యనాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రూపాలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతుంటాయని, అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్యాస్ సిలిండర్ లీక్ అయిన సమయంలో ఇంటిలోని కిటికీలను తెరిచి ఉంచాలన్నారు. ప్రమాదం జరిగితే వెంటనే డయల్ 101, 102 నంబర్లకు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది చంద్రమోహన్, పాండురంగం, వెంకటేశం, మొగులయ్య, వెంకటయ్య, కళాశాల అధ్యాపకులు రాధ శ్రీవిద్య, రాములు, లక్ష్మణ్, మధుసూదన్, శ్రీధర్, సువర్ణ, సానియా సుల్తానా, శ్రీకాంత్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక తెలంగాణే జాగృతి లక్ష్యం

- సంస్థ జిల్లా అధ్యక్షుడు పాండురంగారెడ్డి



తుక్కుగూడ: సమావేశంలో మాట్లాడుతున్న జాగృతి నాయకులు

తుక్కుగూడ: సామాజిక తెలంగాణ సాధనే జాగృతి లక్ష్యమని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని జాగృతి కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి జనయాత్ర చేపట్టనుందని తెలిపారు. యాత్ర మొదటగా ఈ నెల 25న నిజామాబాద్ నుంచి ప్రారంభమై, 33 జిల్లాలో కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు కోల శ్రీనివాస్, నరేష్, బండారి లావణ్య, ముస్తాఫా, రామకోటి, రాము యాదవ్, నవీన్‌గౌడ్, సందిప్, సత్యానారాయణ, బాబురావు, సాల్వాచారి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

**'జనంబాట'ను జయప్రదం చేద్దాం**

కందుకూరు: సామాజిక తెలంగాణే కవిత లక్ష్యమని, అందుకోసం ఈ నెల 25 నుంచి చేపట్టనున్న 'జనంబాట' కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని జాగృతి జిల్లా అధ్యక్షుడు పాండురంగారెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని కార్యాలయంలో సంస్థ జిల్లా యాత్ర పర్యవేక్షకుడు శ్రీనివాస్, నరేష్, అర్చన సేతుపతి సమక్షంలో నిర్వహించిన జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాత్రలో భాగంగా ఆదివాసి, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు బీసీ రిజర్వేషన్ల అమలు, కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకై పోరాటం చేయనుందన్నారు. జాగృతి జిల్లా మహిళా అధ్యక్షురాలు లావణ్య పాల్గొన్నారు.

# బీరప్పగుడి స్థలాన్ని కాపాడండి



ఆందోళన వ్యక్తం చేస్తున్న కుర్మసంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: బీరప్పగుడి స్థలాన్ని కాపాడాలని కుర్మ సంఘం ఆదిబట్ల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆలయ భూమిలో ఆ సంఘం నాయకులు గుంతలు తవ్వగా.. వాటిని పోలీసుల సహకారంతో ప్లాట్ల యజమానులు కూల్చివేశారని ఆరోపిస్తూ.. వారితో వాగ్వివాదానికి దిగారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడారు. ప్రైవేటు స్థలంపై హైడ్రాకు, పోలీసులకు ఏంపనని ప్రశ్నించారు. చెరువులు, కుంటలు, అక్రమ నిర్మాణాలను వదిలేసి, పట్టా భూమి జోలికి ఎందుకు వస్తున్నారని మండిపడ్డారు. స్టే ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా రోడ్డు ఉందని పేర్కొంటూ.. గతంలో హైడ్రా.. గుడి ప్రహరిని కుల్చీవేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సివిల్ తగాదాలో పోలీసులు జోక్యం చేసుకోవద్దని సూచించారు. అనంతరం ఠాణాకు వెళ్లి, భూమి జోలికి రావొద్దని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలం, సంఘం నాయకులు జంగయ్య, రాజు, శివకుమార్, శ్రీనివాస్, వెంకటేశ్, రవి, నర్సింహా, భాస్కర్ పాల్గొన్నారు.

# అరకొర బస్సులు.. ప్రయాణికుల పాట్లు

- విధిలేక ఒంటికాలిపై ఆడబిడ్డల పయనం



యాచారం- కందుకూరు రూట్ బస్సులో కిక్కిరిసిన ప్రయాణికులు

యాచారం: మహాలక్ష్మి పథకం పేరిట ప్రభుత్వం.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. కానీ అందుకు తగిన విధంగా సర్వీసుల సంఖ్య పెంచకపోవడంతో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగి.. అవస్థల నడుమ ఆడబిడ్డలు ఒంటికాలిపై పయనిస్తూ.. ఇబ్బంది పడుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. పురుషులదీ అదే సమస్య. యాచారం- కందుకూరు రూట్లో సరిగా బస్సులు లేక.. అరకొర బస్సు ట్రిప్పులతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. ఈ రూట్లో ఉదయం, సాయంత్రం వేళలో రెండు మండలాల పరిధి గ్రామాల నుంచి వందలాది మంది విద్యార్థులతో పాటు అనేక మంది యాచారం మండల కేంద్రం, ఇబ్రహీంపట్నం, నగరానికి రాకపోకలు సాగిస్తుంటారు. ప్రయాణికులు అధికంగా ఉన్నప్పటికీ.. సంస్థ అధికారులు సర్వీసులు, ట్రిప్పులు పెంచకపోవడంతో ప్రజలు నరక ప్రయాణం చేస్తున్నారు. ఫుట్‌బోర్డు ప్రయాణంతో ప్రమాదాలకు గురవుతున్నట్లు తెలుస్తోంది. ఆర్టీసీ అధికారులు స్పందించి.. ఈ మార్గంలో అదనపు బస్సులు నడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# పట్టుదల ఉంటే.. విజయాలు వెంటే

- మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ రవికుమార్



శిక్షణా కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు

షాద్‌నగర్‌రూరల్: కృషి, పట్టుదల ఉంటే విజయాలు వెన్నంటే ఉంటాయని మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ రవికుమార్ అన్నారు. పట్టణ సమీపంలోని నూర్ ఇంజినీరింగ్ కళాశాలలో.. గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా పోలె ఆధ్వర్యంలో కొనసాగుతున్న 'స్వయం ఉపాధి నైపుణ్యాల అభివృద్ధి' శిక్షణా కార్యక్రమంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. జీవిత గమనంలో ఎదురయ్యే సవాళ్ల ఎదుర్కొన్నప్పుడే లక్ష్యాన్ని చేరుకుంటామని చెప్పారు. విద్యార్థులు చదువులో రాణిస్తూ.. వృత్తి నైపుణ్యాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. చిన్నచిన్న విషయాలకు కుంగిపోకుండా, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగినప్పుడే విజయతీరాలకు చేరుకుంటారని స్పష్టం చేశారు. లక్ష్య సాధనకు ప్రణాళికలను రూపొందించుకొని, నిరంతరం శ్రమించాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ నీతాపోలె మాట్లాడుతూ.. అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతగానో దోహదపడతాయన్నారు. కళాశాల స్థాయిలోనే ఉద్యోగ అవకాశాలు, ఉపాధిని కల్పించుకునే దిశగా ప్రేరణనిస్తాయ పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.